విస్తరణ పనులతో అవస్థలు

శంకరపట్నం: కరీంనగర్–వరంగల్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులు జరుగుతున్నందున రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శంకరపట్నం మండలంలో తాడికల్ నుంచి కొత్తగట్టు వరకు సుమారు 18 కిలోమీటర్ల జాతీయ రహదారి విస్తరించి ఉంది. తాడికల్ నుంచి అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, చింతగుంట, గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఈరోడ్డు గుండానే ప్రయాణించాల్సి ఉంది. పనులు జరుగుతున్నప్పుడు కాంట్రాక్టర్ రోడ్డు నీళ్ల చల్లకపోవడంతో దుమ్ములేస్తోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రజలతో పాటు కరీంపేట గ్రామస్తులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. తాడికల్ నుంచి ఒకవైపు రోడ్డు పనులు జరుగుతుండగా పాత రోడ్డు కొంత భాగం తొలగించగా రోడ్డు ఇరుకుగా తయారై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల తాడికల్, గుండ్లపల్లి గ్రామ శివారుల్లో ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాత పడ్డారు. పనులు జరుగుతున్న చోట డైవర్షన్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, దుమ్ము లేవకుండా నీరు చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.


ముమ్మరంగా సాగుతున్న కరీంనగర్ - వరంగల్ రోడ్డు విస్తరణ పనులు

దుమ్ము లేవకుండా నీరు పట్టాలి


కేశవపట్నంలో బైపాస్ రోడ్డు వేసేందుకు మట్టిపోసి రోలింగ్ చేస్తున్నారు. మట్టి పని జరుగుతున్నప్పుడు దుమ్ములేచి కళ్లలో పడుతోంది. దుమ్ములేవకుండా మట్టిపై నీరు పట్టాలి. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.
– గోపి రాజమల్లు, కరీంపేట

రోడ్డును తవ్వారు.. కాలువగా మార్చారు



మానకొండూర్‌రూరల్: సాగునీటి కోసం రోడ్డును కాలువగా మార్చారు. ఎవరి అనుమతి లేకుండా ఓరైతు తన ఇష్టానుసారంగా రోడ్డును మొత్తం తవ్వేశాడు. ఫలితంగా రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. మానకొండూర్ మండలం వెల్ది గ్రామ శివారులో లింగాపూర్- వెల్ది గ్రామాల రోడ్డును ఓరైతు అడ్డంగా తవ్వేశాడు. అవతలి పక్కన ఉన్న పొలం నుంచి ఇవతలి వైపు ఉన్న తనపొలంలోకి నీరు వెళ్లేందుకు రోడ్డును కాలువగా మార్చాడు. ఇప్పుడది ఇబ్బందిగా మారింది. ఇటీవల ఓవ్యక్తి కాలువ వద్ద అదుపు తప్పి పడి తీవ్రగాయాలపాలయ్యాడని గ్రామస్తులు చెబుతున్నారు. అసలే అధ్వానమైన రోడ్డు... ఆపై కొందరి చర్యల కారణంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల


పంపుహౌస్ వద్ద నాయకుల సంబరాలు

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పరిధిలో గల గాయత్రి పంపుహౌస్ నుంచి సోమవారం రాత్రి 6వ మోటారు ఆన్ చేసి నీటి గ్రావిటీ కాలువకు నీరు విడుదల చేశారు. పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లడంతో నీటిని విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రావిటీ కాలువ వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

ఎంవీఐకి సన్మానం


ఎంవీఐని సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ రవాణాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కంచి వేణును మంగళవారం ఎంవీఐ కార్యాలయంలో ట్రస్మా నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కారించి, స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరెం సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజకుమార్, మాడిశెట్టి ప్రసాద్, తిరుపతి యాదవ్, పరాంకుశం కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రజని

జమ్మికుంట: యువత ఓటుహక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని తహసీల్దార్ రజని అన్నారు. పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, శివరుద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటుహక్కు ప్రాముఖ్యత, ఓటుహక్కు విలువ, ప్రాధాన్యంపై అవగాహన ఉండాలని అప్పుడే సరైన నాయకుడిని ఎన్నుకోవచ్చని తద్వారా సమాజానికి మంచి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా ప్రతినిధి వెంకటరాంబాబు, కళాశాల ప్రిన్సిపల్ వంశీకృష్ణ, పవన్, అశోక్, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలి


సమావేశంలో బీఎస్పీ నాయకులు

జమ్మికుంట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసాల రామస్వామి అన్నారు. పట్టణంలో మంగళవారం పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బూత్‌స్థాయిలో క్యాడర్‌ను పటిష్ఠపరిస్తూ ముందుకెళ్లాలన్నారు. అనంతరం నూతనంగా అసెంబ్లీ కార్యదర్శిగా, హుజూరాబాద్ మండల ఇన్‌చార్జిగా రామ్ శ్రీనివాస్, అసెంబ్లీ ఈసీ మెంబర్‌గా రాచపల్లి రమేశ్‌ను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు రవీందర్, అసెంబ్లీ ఇన్‌చార్జి మొగిలయ్య, నాయకులు ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్, నరేశ్, దిలీప్‌గౌడ్, కుమార్‌యాదవ్, అనిల్, మహేందర్, శివశంకర్ పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి రైతువేదికలో మంగళవారం జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి రైతులకు పంటల్లో చీడపీడలు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయంతో రైతులు, నేలకు కలిగే లాభాలను వివరించారు. ఏవో వైదేహి, ఏఈవో రజిత రైతులు ఉన్నారు.

అనారోగ్యంతో బీజేపీ నాయకుడి మృతి

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మాడుగుల ప్రవీణ్ కుమార్ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ప్రవీణ్ మృతిపట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, నాయకులు వొడ్నాల విజయ్, ప్రభాకర్, శశి, తూర్పాటి రాజు, వేణు ప్రగాడ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ప్రవీణ్ మృతి పార్టీకి తీరనిలోటు అని పలువురు పేర్కొన్నారు.

సాగునీటి కోసం రైతుల తిప్పలు

గన్నేరువరం: సాగునీటి కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా గన్నేరువరం మండలానికి సాగునీరు సరఫరా అవుతుంది. కానీ ఇటీవల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయకపోవడంతో ఉపకాల్వలకు పూర్తి స్థాయిలో సాగునీరు సరఫరా కావడం లేదు. మండలంలోని చొక్కారావుపల్లెతో పాటు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి, జవారిపేట గ్రామాలకు సాగునీటికి సంబంధించి ఉపకాల్వ 4 నిర్మించారు. కానీ ఈ కాల్వలోకి సాగునీరు రావడం లేదు. దీంతో చొక్కారావుపల్లె గ్రామంలో నీటి ఎద్దడితో పంట పొలాలకు నీరు అందించని పరిస్థితి నెలకొందని రైతులు తెలిపారు. ప్రధాన కాల్వలో నీటి సరఫరా తక్కువ ఉండటంతో సమస్య తలెత్తుతుందని రైతులు తెలిపారు. దీంతో ప్రధాన కాల్వలో వచ్చే కొద్ది పాటి సాగునీటిని ఉపకాల్వ 4కు తరలించే విధంగా రైతులు గాలిపెల్లి వద్ద ప్రధాన కాల్వ వద్దకు చొక్కారావుపల్లె గ్రామ రైతులు మంగళవారం తరలివెళ్లి కాల్వలో పెరుకుపోయిన గడ్డి, నాచును తొలగించారు. పంటల పరిస్థితిని అధికారులు దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు నుంచి సాగునీరు వెంటనే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వలో గడ్డి, నాచు తొలగిస్తున్న రైతులు

నియామకం


ఉత్తర్వులు అందుకుంటున్న రమేశ్‌గౌడ్

హుజూరాబాద్: తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తాళ్లపల్లి రమేశ్ గౌడ్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్ మంగళవారం నియామక ఉత్తర్వులు అందించారు. గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు రమేష్‌గౌడ్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు యాదగిరిగౌడ్ తెలిపారు. నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆహ్వాన పత్రిక విడుదల

చొప్పదండి: జిల్లాలోని గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగే గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను చొప్పదండిలో గౌడ సంఘం నాయకులు మంగళవారం విడుదల చేశారు. 10న బొమ్మకల్‌లో జరిగే సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్యగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, బొడిగె నందయ్యగౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, బైరగోని కిట్టుగౌడ్, ముద్దం మహేశ్‌గౌడ్, చేపూరి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

17న మహాసభభ

హుజూరాబాద్: మాధవ పురుషుల పొదుపు సంఘం పదో వార్షిక మహాసభ ఈ నెల 17న పట్టణంలో నిర్వహించనున్నట్లు సంఘం పర్యవేక్షకుడు తొర్రి రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో సంఘం ఆదాయ, వ్యయాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభకు తప్పనిసరిగా సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

బడ్జెట్ రూపకల్పన సమావేశం

చొప్పదండి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూపకల్పనపై మంగళవారం సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రస్తుత సంవత్సర బడ్జెట్‌తో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.3.78 కోట్ల మేర సాధారణ ఆదాయం, రూ.11 కోట్ల అంచనా క్యాపిటల్ ఆదాయ, వ్యయాలు రూపొందించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్ మొత్తం రూ.14.84 కోట్లుగా ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి, రుక్మాపూర్, చాకుంట, కొలిమికుంట, భూపాలపట్నం, వెదురుగట్టు, సాంబయ్యపల్లి, గుమ్లాపూర్, మంగళపల్లి, కుర్మపల్లి గ్రామాలలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం ప్రారంభించారు. అనంతరం మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు ఉచితంగా ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్, జెడ్పీటీసీ సౌజన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశం, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


గన్నేరువరం: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి


జమ్మికుంటలో ప్రభాకర్, బాలవికాస ప్రతినిధులు



హుజూరాబాద్: మాట్లాడుతున్న ఎస్సై రాజు

హుజూరాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎస్‌ఐ రాజు అన్నారు. పట్టణంలోని బాలవికాస కార్యాలయంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఎంతోగానో ఉపయోగపడుతుందని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ కోఆర్డినేటర్ సరళ, సెంటర్ మేనేజర్ ఎండీ ఖాజాబీ, లీలా, రజిత తదితరులు ఉన్నారు.

గన్నేరువరం: కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్‌నేషనల్ లయన్స్ క్లబ్ 320జీ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ భవనం సర్వీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా కంటి చికిత్సలు అందించడం జరిగిందన్నారు. ఐ చెకప్ మిషన్ సైతం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏర్పాటుకు హనుమండ్ల రాజిరెడ్డి, గుంటుక చంద్రప్రకాష్, మోర బద్రీశం, బుర్ర మధుసూదన్‌రెడ్డిలు ఆర్థికసాయం అందించారని లయన్స్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, ఎస్సై నరేష్, వైస్ డిస్ట్రిక్ గవర్నర్ కొదండ రాములు, డిస్ట్రిక్ సెక్రెటరీ వెంకటరమణారెడ్డి, ఏపీఎం లావణ్య, చైర్ పర్సన్ సునీల్, ట్రస్ట్ చైర్మన్ వెంకన్న, లియో డిస్ట్రిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రామకృష్ణ, ప్రభాకర్, కిషన్‌రెడ్డి, ఎల్లయ్య, భాస్కర్, రవి, చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

జమ్మికుంట: కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చని టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కుట్టు శిక్షణలో మెలకువలు నేర్చుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. సంస్థ ద్వారా మహిళలకు 21 రోజుల శిక్షణ, అనంతరం కుట్టుమిషన్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో బాలవికాస సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ అమూల్య, జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, ఇన్‌స్ట్రక్టర్ లావణ్య,మహిళలు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి వేతనాలను చెల్లించాలి


మాట్లాడుతున్న అంజిరెడ్డి, నాయకులు

గన్నేరువరం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రభుత్వం వెంటనే వేతనాలను చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి కోరారు. మండలకేంద్రంలో మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలను చెల్లించకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారుతోందని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వానికి, కూలీలకు అనుసంధానకర్తలుగా ఉపాధిహామీ సిబ్బంది పని చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయలోపంతో వారికి కేటాయించిన నిధులు ఇతర అవసరాలకు మళ్లీస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధిహామీ నిధులను పథకానికి వర్తింపజేయడంతో పాటు వేతనాలను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం, యువజన నాయకులు మొలుగూరి అంజనేయులు కోశాధికారి గర్మికుర్తి శ్రీనివాస్, ఏలేటి తిరుపతిరెడ్డి, బోయిని మల్లయ్య, జాలి గోపయ్య, నయూమ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభించిన డీఈవో


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఈవో జనార్దన్

మానకొండూర్: అన్నారం గ్రామ ప్రజలు ఆదర్శమని జిల్లా విద్యాధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్ రావు అన్నారు. మంగళవారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి హద్దుల ఏర్పాటు కార్యక్రమానికి డీఈఓ హాజరయ్యారు. మాజీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడిన అనంతరం కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. గ్రామానికి చెందిన బొద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాఠశాలకు అందించిన సీసీ కెమెరాలు, పాకాల పురుషోత్తంరెడ్డి, రామగిరి సారయ్య, రేగుల రవీందర్ విద్యార్థులకు అందజేసిన వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్రజలు విద్యార్థుల సౌకర్యాలను తీర్చడం అభినందనీయమన్నారు. వంటగది, ఫర్నీచర్ అందించిన పాకాల కృష్ణారెడ్డిని కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు నేర్పించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


నాయకులు, కార్యకర్తలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కుట్రలతో కూల్చుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రం లో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని, ఎన్నికలు వస్తున్నాయని యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తీసువచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు తప్ప కొత్తగా వచ్చిన నిధులు ఏమీ లేవన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేగా తన గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, కార్యదర్శి సునీల్, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి మల్లేశం, ఎస్సీ సెల్, కిసాన్ మండల అధ్యక్షులు అనిల్, చంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీది దుర్మార్గ పాలన

శంకరపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రామరాజ్య పాలన కాకుండా దుర్మార్గ పాలన చేస్తుందని ఎమ్మెల్యే ఘాటువ్యాఖ్యలు చేశారు. మండల శివారులోని ఓఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభలో ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని, ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడంతో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బసవయ్య, పద్మ, ఎస్ఎల్‌గౌడ్, తిరుపతి, మల్లారెడ్డి, చంద్రమౌళి, సంపత్ పాల్గొన్నారు.

'బీజేపీ, కాంగ్రెస్‌లతో ఒరిగిందేమీ లేదు'


చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీల వల్లే దేశం అధోగతిపాలైందని, 65 ఏళ్లుగా పాలించిన ఆ పార్టీతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో, మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్‌లో జరిగిన ప్రధాని మోదీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నాయకులు హరిశంకర్, రవీందర్‌రెడ్డి, అనిల్‌కుమార్, సూర్యశేఖర్, కులదీప్ వర్మ, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామడుగు: జిల్లా కేంద్రంలో 12న నిర్వహించే కరీంనగర్ పార్లమెంట్ స్థాయి బీఆర్ఎస్ కదనభేరీ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పిలుపునిచ్చారు. మండలంలోని షానగర్ గ్రామ పరిధిలోని ప్రవేట్ ఫంక్షన్ హాల్‌లో రామడుగు మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

చొప్పదండి: దుబాయిల్ చనిపోయిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి మంజూరైన రూ.15 లక్షల చెక్కును రవిశంకర్ మృతుడి కుటుంబానికి అందించారు. మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన గుర్రం వెంకటస్వామి కొద్ది నెలల క్రితం గుండెపోటుతో దుబాయిలో మృతి చెందాడు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న రవిశంకర్ ఎంబసీ అధికారులతో మాట్లాడి రూ.15 లక్షల బీమా మంజూరు కావడానికి కృషి చేశారు. ఈమేరకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలోరవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వినయ్, చంద్రశేఖర్ గౌడ్, రాజశేఖర్, కుమార్ పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీ

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి మంగళవారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల పురోగతిని, ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేంద్ర బలగాల అధికారులతో సీపీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌జీ, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

వీణవంక: విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్‌లో గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ క్లబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు హఫీజొద్దీన్, శ్రీదేవి, శిరీష, ఆయేషా ఉన్నారు.

బస్సు సదుపాయం కల్పించాలి

గన్నేరువరం: కరీంనగర్ నుంచి వయా గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, పీచుపల్లి, వద్దూరు, బేగంపేట్ మీదుగా సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని కోరుతూ ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టి తీసుకెళ్లామని, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఉదయం, సాయంత్రం బస్సు నడపడానికి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి



జమ్మికుంట: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాల ప్రకారం.. జమ్మికుంట రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫామ్ నాలుగో ప ట్టాల లైన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు (65) పట్టా లు దాటుతుండగా అయోధ్య స్పెషల్ ట్రెన్ ఢీకొని మృతిచెందాడు. తెలుపురంగు, నలుపు, లైట్ బ్రౌన్ రంగు నిలువు గీతల ఫుల్‌షర్ట్, బ్లూ కలర్ గీతల లుంగీ ధరించాడు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిస్తే 99493 04574, 87126 58604 సెల్ నంబర్లలో సంప్రదించాలని రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబల్ పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సారార్ కళాశాల బాలికల వసతి గృహంలో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు ఎక్కువ అవుతుండటం బాధాకరమని పేర్కొన్నారు. గృహ హింస నిరోధక, పని చేసే ప్రదేశాల్లో మహిళలకు రక్షణ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. చక్కగా చదువుకొని, క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వసతి గృహంలో సౌకర్యాలపై వివరాలు అడిగారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేశ్, వసతి గృహం నిర్వాహకులు రేవ పాల్గొన్నారు.